# సంగీత విద్వాంసుడు



డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన సాంస్కృతిక వారోత్సవాలు జరుగుతున్నాయి.

కర్నాటక సంగీతం, లలిత సంగీతం, వాద్య సంగీతం వంటి వాటిల్లో పోటీలు పెట్టారు. మొదటగా కర్నాటక సంగీతంలో పోటీని ప్రకటించారు.

మొదటి పేరే గణపతిది. పేరు పిలవగానే చిరునవ్వులు చిందిస్తూ వేదిక మీదికొచ్చి, సభికులకి నమస్కారం చేసి, బాసిపట్టు వేసుకున్నాడు. అచ్చమైన దోణాది విద్వాంసుడిలాగా లుంగి, పొడుగుచేతుల చొక్కా వేసుకొని, విభూతి పిండికట్లు పెట్టి, పైన రూపాయి కాసంత కుంకుమ దిద్ది మరీ వచ్చాడు. పాటకోసం కేటాయించబడిన ఐదు నిమిషాలలో ఆలాపన,

కీర్తన, సంగతులు అన్నీ వేశాడు. కాని, వాటికంటే ఎక్కువ తల ఆడించడం, చేతులు సాచటం, శ్రుతి వేసే వాని వంక చూసి చిరునవ్వు నవ్వడం యధావిధిగా చేశాడు.

జడ్జీల వంక తిరిగి నవ్వినప్పుడు- వాళ్ళు ముఖం గంభీరంగా పెట్టుకున్నట్లో, ముడుచుకున్నట్లో అనిపించింది. గంట కొట్టగానే గణపతి వేదిక దిగిపోయాడు.

నాకు కొంచెం విసుగ్గా ఉండి హాలు బయటకు వచ్చి వరండాలో తిరుగుతున్నాను.

గణపతి కూడా వచ్చి "కాఫీ కెడదాం రా..." అంటూ లాక్కెళ్లాడు.

హోటల్‌కి వెళ్లాక స్వీట్స్‌కి అర్డరిచ్చాడు. మనిషి మహా ఉత్సాహంగా ఉన్నాడు.

"ఏమిటి కథ... స్వీట్స్ ఇప్పిస్తున్నావు?" నేను ఆశ్చర్యం వ్యక్తం చేశాను.

"నాకు కర్నాటక సంగీతంలో బహుమతి వచ్చింది" అన్నాడు సగర్వంగా.

'జడ్జీలలో వీడికి ఎవరైనా లోపాయికారిగా తెలుసా? ఇంకా పోటీ పూర్తి కానేలేదు. బహుమతి వచ్చిందంటాడేమిటి?' నా ముఖమండలం పెద్ద ప్రశ్నార్థకంగా మారిపోయింది.

"బహుమతి ఇంకా ప్రకటించలేదనుకో- కాని, రావడం ఖాయం. ఇంకో గంటలో పోటీలన్నీ అయిపోయాక నువ్వే చూస్తావుగా!" అన్నాడు.

"మరి, నీకు ముందే ఎలా తెలుసు? అయినా... ఏ బహుమతి?" అని అడిగాను.

"చూడు బాబూ- దీనికి ఎవరూ చెప్పనక్కర్లేదు. కామన్‌సెన్స్ ఉంటే చాలు! పోటీకి ఉన్నవి మూడు బహుమతులు. పోటీలో పాల్గొంటున్నది ముగ్గురు. అందువల్ల ముగ్గురికీ ఖాయంగా ఏదో ఒక బహుమతి వస్తుంది" అన్నాడు.

"విష్ యూ ఫస్ట్ ప్రైజ్!" అని స్వీట్ తినడం ప్రారంభించాను నేను.

ఫలితాలు ప్రకటించే సమయం ఆసన్నమైంది.

గణపతి ముఖంలో ఆనందం తాండవిస్తోంది.

నిర్వాహక కార్యదర్శి లేచి బహుమతుల వివరాలు చదవటం మొదలుపెట్టాడు.

"మొదట- కర్నాటక సంగీతం! ఈ పోటీలో పాల్గొన్న వారెవరికీ సంగీత పరిజ్ఞానం సరిగా లేదని జడ్జీలు అభిప్రాయపడి మొదటి బహుమతి రద్దుచేశారు. స్థాయి తక్కువ ఉన్నా ప్రోత్సహించే ఉద్దేశంతో రెండవ బహుమతి కె. రామారావుకు, మూడవ బహుమతి పి. లోకనాథంకు..." మిగిలిన పోటీల లిస్టు చదువుకుపోతున్నాడు ఆయన.

ఫలితాలు వినగానే నా చూపులు గణపతి కోసం హాలంతా వెదికాయి. కాని, ఆ మానవుడెక్కడా కనిపించలేదు. ఫలితం ప్రకటించగానే నేనెక్కడ పలకరిస్తానో, ఏమో...నన్నే భయంతో బయటికి చెక్కేసినట్టున్నాడు.

– తెలుగు వార పత్రిక... *18 ఫిబ్రవరి '83*